క్లుప్తంగా

నేటి నుంచి వన్నూర్‌సాహెబ్ గుట్ట ఉరుసు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ సమీపంలోని వన్నూర్‌సాహెబ్‌గుట్టలో వెలసిన బాబా ఎసానుల్లాఖాన్‌వార్సీ దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు గంధం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, శుక్రవారం ఖవ్వాలీ, మెడికల్ క్యాంపులతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. హిందూ,ముస్లిం సోదరులు ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

రేపు ఆనంద ఆశ్రమంలో ఆరాధన మహోత్సవం

తంబళ్లపల్లె: మండలంలోని ఎద్దులవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ భగవాన్ కొండవధూత స్వామి మఠంలో గురువారం ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గురు ప్రార్థనలు, ఆరాధన కైంకర్యాలు, 10 గంటల నుంచి గంధం, జెండా ఉత్సవాలు, గురు పరంపరల ఉత్సవాలు జరుగుతాయన్నారు. తదుపరి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భజనలు, తత్వకీర్తనలు, గురువులచే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయన్నారు. భక్తులు ఆరాధాన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణతో సమ న్యాయం చేయాలని వినతి

నిమ్మనపల్లె : ఎస్సీ వర్గీకరణతో ఆ వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డి ప్రసాద్, గణేష్ హరి మల్లేశ్వర అన్నారు. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ కమిటీలోని సభ్యులైన మాజీ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా కు మంగళవారం చిత్తూరులో వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మాల మహానాడు జిల్లా కార్యదర్శి వీరనాల మాణిక్యం, నాయకులు సుధాకరలు సైతం ప్రత్యేకంగా వినతి పత్రం అందించారు. మంగళవారం నిమ్మనపల్లె మండలం నుంచి పెద్ద సంఖ్యలో బయలుదేరి చిత్తూరుకు వెళ్లారు.చిత్తూరులో ఎస్సీ వర్గీకరణ పై అభ్యంతరాలను, సూచనలు, సలహాలను ఎస్సీ వర్గాల ప్రజలు, నాయకుల నుంచి స్వీకరణ లో భాగంగా ఉనికి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మనపల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు, మాల మహానాడు సంఘ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల స్టడీ మెటీరియల్ వితరణ



స్టడీ మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు శ్రీ కౌశిక్ మెమోరియల్ ట్రస్టు తరపున స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. మంగళవారం ట్రస్ట్ చైర్మన్ ఆవుల రమణయ్య 25 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరత్నమ్మ, విశ్రాంతి ఉపాధ్యాయులు పుల్లయ్య, ఉపాధ్యాయులు మదన మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆంజినేయులు, వసీమా, రాణి పాల్గొన్నారు.

కలపజాతి మొక్కల పెంపకంపై శిక్షణ



మాట్లాడుతున్న అటవీశాఖాధికారి శ్రీనివాసులు

కలికిరి: స్థానిక కేవీకే కార్యాలయంలో ఆగ్రో ఫారెస్ట్రీపై కేవీకే, సీఐఎఫ్ఓఆర్, ఐసీఆర్ఏఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కలపజాతి మొక్కల పెంపకంపై రైతులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డివిజినల్ అటవీశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ కలప జాతి మొక్కల పెంపకంపై ఇచ్చే శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు రోజుల శిక్షణ, ఒక రోజు క్షేత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. జిల్లాలో సుమారు 5వేల మంది రైతులకు శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీపీఎం ధర్మరాజు, కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల, టోపి రాష్ట్ర అసోసియేట్ సతీష్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ

పీలేరు : నిత్యావసర సరుకులు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్ రావు అన్నారు. మంగళవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 56 చౌకదుకాణలు ఉన్నాయని, 21,941 రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. పది ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ కందిపప్పు, చక్కెర, బియ్యం, జొన్నలు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సమయపాలనతో వస్తువులు పంపిణీ చేయలని తెలిపారు.

అటకెక్కిన హార్సిలీహిల్స్ నీటి పథకాలు

- రూ.2.8కోట్లతో ప్రత్యేక నీటి సరఫరా లేదు
- వాటర్ గ్రిడ్‌తో అనుసంధానం రద్దు



గాలేటీవారిపల్లె సమీపంలోని టూరిజం నీటీ పథకాలు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పెరుగుతున్న తాగునీటి అవసరాలకు అనుగుణంగా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చేపట్టిన నీటి ప్రణాళికలు అటకెక్కాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రతిపాదనలను పక్కన పెట్టడం లేదా రద్దు చేయడం వంటి చర్యలతో పథకాలు అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతానికి నీటి సమస్య లేకున్నా భవిష్యత్తులో వచ్చిందంటే పర్యాటకుల రాకపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనితో ఈ సమీప భవిష్యత్తులో సమస్య రాకుండా ఉండేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చేసిన ప్రతిపాదన, వైఎస్సార్‌సీపీ చేసిన ప్రతిపాదనలు రెండూ రద్దు కావడంతో ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందో చూడాలి.

రోజుకు 1.10లక్షల లీటర్లు

ప్రస్తుతం హార్సిలీహిల్స్‌కు గాలేటివారిపల్లె వద్ద ఉన్న నీటి పథకాల ద్వారా నీటిని పైప్‌లైన్ ద్వారా తరలిస్తున్నారు. ఏడుదశల్లో నీటిని పైకి తరలిస్తారు. ఇలా తరలింపు చాలా కష్టంతో కూడుకున్నది. ఎప్పుడైనా ఒక మోటారు కాలిపోయినా మరమ్మతులకు గురైన వాటిని స్థానంలో మరొకటి ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలంటే ఎంతో కష్టపడాలి. హార్సిలీకొండపై రోజుకు 1.50 లక్షల లీటర్ల నీటి వినియోగం ఉంది. టూరిజం రెస్టారెంట్, బార్, అతిథి గృహాలకు, సిబ్బంది అవసరాలకు, స్థానికంగా ఉన్న ప్రభుత్వశాఖలకు, నివాస కుటుంబాలకు సరఫరా చేస్తారు. 2014లో నీటి కొరత కారణంగా రోజుకు కేవలం 40వేల లీటర్ల నీరు మాత్రమే లభ్యత ఉండేది. ఈ నీరు సరిపోకపోవడంతో పర్యాటకశాఖ అతిథిగృహాలను మూసేసింది. పర్యాటకశాఖ నీటినిల్వలకోసం నిర్మించిన 2.40లక్షల లీటర్ల సామర్థ్యమున్న రెండు సంపులుండగా అటవీశాఖకు 40వేల లీటర్ల సామర్థ్యమున్న సంపులు ఉన్నాయి. ఈ సంపులు నిత్యం నిండి ఉండి అవసరాలకు వినియోగించుకొంటుంటారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పథకం ఇది

గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు రూపొందిన రూ.2.80కోట్ల ప్రతిపాదనను ఆరేళ్ల క్రితమే టూరిజంశాఖ కార్యదర్శికి పంపగా ఇప్పటి వరకు అతీగతీలేదు. ప్రతిపాదిత పథకం ప్రకారం... కురబలకోట మండలం తెట్టు గ్రామంలో సాగుతున్న హంద్రీ–నీవా కాలువలో ప్రవహించే నీటిని నాలుగు కిలోమీటర్ల దూరంలోని తెట్టు పెద్దచెరువుకు తరలించి, అక్కడే నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటుచేసి, నీటిని శుద్ధి చేశాక ఇక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలోని టూరిజంశాఖకు చెందిన నీటి పథకాలను నీటిని పంపింగ్ చేస్తారు. ఈ పథకాలనుంచి కొండపైకి నేరుగా వెళ్లే పైప్‌లైన్ ద్వారా నీటిని కొండకు సరఫరా చేయాలి. హంద్రీ–నీవా కాలువలో నీటి ప్రవాహంలేని పక్షంలో కొత్తగా నాలుగు బోర్లు వేసేందుకు ప్రతిపాదించారు. దీని కోసం కొత్తగా 15 విద్యుత్ మోటార్లు, పంపింగ్ సామాగ్రి అవసరమని ప్రతిపాదనల్లో సూచించారు. అయితే ఇంతవరకు ఈ ప్రతిపాదన గురించి పట్టించుకోలేదు.

వాటర్‌గ్రిడ్ రద్దు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హార్సిలీహిల్స్‌కు వచ్చే 30 ఏళ్లపాటు నీటి సమస్య తలెత్తకుండా వాటర్‌గ్రిడ్ పథకంలో చేర్చింది. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల కోసం రూపొందించిన ఈ గ్రిడ్‌లో హార్సిలీహిల్స్‌ను చేర్చారు.

కాలువలో ప్రవహించే కృష్ణా జలాలను తరలించేలా ప్రణాళికను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసి మంజూరు చేసింది. దానికి ఆమోదం తెలిపి, పనులు మొదలయ్యే సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ పనిని రద్దు చేసింది. దీనితో కొండకు తాగునీటి శాశ్వత పరిష్కార పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

ప్రమాదంలో ప్రభుత్వ వైద్యం

- మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుందాం
- సామూహిక దీక్షలో పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు



ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సామూహిక దీక్ష చేస్తున్న వివిధ పార్టీలు ప్రజా సంఘాల నాయకులు

మదనపల్లె: మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేటు పరం కాకుండా పరిరక్షించు కోవాల్సిన బాధ్యత పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, బహుజన సేన అధ్యక్షులు శ్రీ చందు, సీఐటీయూ నాయకులు హరేంద్రనాథ్ శర్మ అన్నారు. మంగళవారం మదనపల్లె మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మూడు రోజుల సామూహిక నిరాహార దీక్షలు ప్రారంభించారు. మొదటి రోజు సామూహిక దీక్షలకు పలు సంఘాలు మద్దతిస్తూ ఆ పార్టీల నాయకులు దీక్షలో పాల్గొన్నారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజ్ ను ప్రభుత్వమే నిర్వహించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్లుగా ఎంతో మంది పేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించిన మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నేడు దయనీయ స్థితికి చేరుకోవడంలో కూటమి పెద్దల కుట్ర దాగుందన్నారు. కూటమి పెద్దలు ప్రభుత్వ సంస్థల ను నిర్వీర్యం చేసి , కార్పొరేట్ సంస్థలకుకట్టబెట్టి పేదల పొట్ట కొట్టేలా చూస్తున్నారన్నారు. బ్రిటిష్ హయంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రతినిధి డాక్టర్ జాకబ్ ఛాంబర్లీన్ మదనపల్లె వచ్చి ఓ చిన్న కుటీరాన్ని ఏర్పాటు చేసుకొని ఇక్కడ వైద్యశాలను ప్రారంభించారన్నారు. ఆ వైద్యశాలే దినదినాభివృద్ధి చెంది మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిగా రూపుదిద్దుకొని ఎంతోమందికి వైద్య సేవలు అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ని రద్దుచేసి ఈ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. మెడికల్ కాలేజీ రూపుదిద్దుకొని ఉంటే ఎన్నో రకాల వైద్య సేవలు ఇక్కడే అందుబాటులో ఉండేవన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని రాజకీయ కుట్రలో భాగంగా రద్దు చేయడం దుర్మార్గమన్నారు. మంజూరై పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సర్వజన బోధనాస్పత్రిని రద్దు చేసి,అందులో భాగంగా వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది బదిలీ చేయడం మదనపల్లె ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. ప్రజలు పార్టీలు నాయకులు మేలుకొని అందరూ ఏకతాటిపైకి పార్టీలకతీతంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఐటీయూసీ కన్వీనర్ జి.కృష్ణమూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నర్సింహులు, బాస్ నాయకులు ముత్యాల మోహన్, సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రఘునాథ్, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, రాజు, బిఎస్పి నాయకులు మిద్దేపల్లి బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు సాంబశివ, సిపిఐ నాయకులు కృష్ణప్ప, మురళి, బాస్ నాయకులు రెడ్డి ప్రసాద్, గంగాధర్, ప్రజాసంఘాల నాయకులు మునివెంకటప్ప, ఉత్తన్న, ఆంజప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

– సమన్వయకర్త నిసార్‌అహ్మద్



నిసార్‌అహ్మద్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి తదితరులు

మదనపల్లె : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేద్దామని సమన్వయకర్త నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం అన్నమయ్యజిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన శివప్రసాద్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా యూత్ అధ్యక్ష పదవికి తనను ప్రతిపాదించడంపై కృతజ్ఞతలు తెలుపుతూ దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీకి తిరిగి పూర్వవైభవం రానున్నదని, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయాల్లో కష్టాలు శాశ్వతం కాదని, మంచివైపు దేవుడు తప్పకుండా ఉంటాడని, కార్యకర్తలు ఓపిగ్గా ఉండాలన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని, ఎన్నికల ముందు చంద్రబాబు అబద్ధాలతో ప్రజలను మోసం చేశారన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందని, టీడీపీ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజాసమస్యలపై పోరాడాలని, నిత్యం ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. మదనపల్లె నియోజకవర్గంలో యువజన విభాగాన్ని పటిష్టం చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్యజిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, చిప్పిలి మల్లికార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బి.కొత్తకోట: సింగిల్‌విండో మాజీ చైర్మన్ తిరుమల అమరనాథ్‌ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. అమరనాథ్ తండ్రి తిరుమల వెంకట నరసప్ప మృతి చెందాడు. మంగళవారం ఎమ్మెల్యే వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరై నరసప్పకు నివాళులర్పించారు.

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పాడిరైతులకు సూచనలిస్తున్న పశువైద్యులు

కలకడ : మండలంలో అన్ని గ్రామాల్లో ఈనెల 31వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు, పశువుల, మేకల, గొర్ల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ డీపీడీ క్రిష్ణయ్య కోరారు. మంగళవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె, ఎర్రకోటపల్లె పశువైద్యశాల పరిధిలోని కదిరాయచెర్వు చెర్వు, బొంతలవారిపల్లెలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాలను తనిఖీ చేశారు. చలికాలంలో పశువులకు వ్యాప్తి చెందే వాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పశువులకు, లేగదూడలకు, ఆవులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, గర్భకోశవ్యాధులకు చికిత్స వంటివి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ తేజకళ్యాణ్, పూర్ణిమ, జేవీడీలు జయచంద్ర పాల్గొన్నారు.

అక్రమంగా వాటర్‌షెడ్డు గుంతలు తీశారని ఫిర్యాదు



అక్రమంగా తీసిన గుంతను చూపుతున్న అమరప్పనాయుడు

తంబళ్లపల్లె: తమ పొలంలో అక్రమంగా అధికార పార్టీ నాయకులు వాటర్‌షెడ్ గుంతలు తీసి బిల్లులు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ వాటర్‌షెడ్ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు బాధిత రైతులు మంగళవారం విలేకర్లకు తెలిపారు. బాధితుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని మర్రిమాకులపల్లె పంచాయతీ ఆవులమర్రిపల్లెకి చెందిన కోటకొండ అమరప్పనాయుడు పేరు 297 /2 సర్వే నంబర్‌లో 4.94 ఎకరాలు లేట్ సుధాకరప్పనాయుడు పేరున సర్వే నంబర్ 295–1లో 2.50 ఎకరాలు, 297–1లో 1.48 ఎకరాల డికెటి పట్టా భూమి ఉన్నట్లు తమ్ముడు హేమానంద్‌నాయుడు తెలిపారు. ఈ భూమిలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అక్రమంగా వాటర్‌షెడ్ కుంటలు జెసిబిలతో వాటర్‌షెడ్ గుంతలు తీశారని ఆరోపించారు. ఆ పొలంతోనే మా జీవనం సాగిస్తున్నామని బాధితులు వాపోయారు. దీనిపై వాటర్‌షెడ్ అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుని తమకు జీవనభృతి కల్పించాలని కోరారు. ఈ విషయమై వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్ ఖాజామైనుద్దీన్‌ను వివరణ కోరగా రైతులు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. వారి అనుమతి లేకుండా పనులు చేయడం తప్పిదమన్నారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి బిల్లులు చెల్లించలేదన్నారు. విచారణ చేసి న్యాయం చేస్తామన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి: అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కలికిరికి విచ్చేసిన ఆయను స్థానిక నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు ఇప్పటికే ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించడం జరిగిందని, ప్రజా సమస్యలు, విద్యుత్ ధరలు పెంపు తదితరాలపై ధర్నా, ర్యాలీలతో ముందుకెళ్లామన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ముందుకు రావడం శుభపరిణామమన్నారు. త్వరలో వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీల నియామకంతో పాటు అనుబంధ విభాగాల నియామకాలు జరుగునున్నాయన్నారు. కమిటీల రూపకల్పనకు నాయకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టించి పని చేసే వారికి కమిటీలలో చోటు దక్కేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కలికిరి, వాల్మీకిపురం మండల కన్వీనర్‌లు రమేష్‌కుమార్‌రెడ్డి, నీళ్ళ భాస్కర్, నాయకులు ఎస్టీడి హరి, రత్నశేఖర్‌రెడ్డి, ఎంఐ హనీఫ్, మధుసూదన్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, మధు, భాను, విజయ్, శామ్యూల్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రమణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు..

పీలేరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతల వెంకట్రమణారెడ్డి(65) మృతి పార్టీకి తీరని లోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మృతుని స్వగ్రామం సోమల మండలం వల్లిగట్ల గ్రామం పుట్టావారిపల్లికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు.


కుష్టువ్యాధి సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



కుష్టువ్యాధి నివారణపై ఆరోగ్యశాఖ అధికారుల ర్యాలీ

గుర్రంకొండ: ఇంటింటా కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, హెల్త్‌ఎడ్యుకేటర్ రఫీ అన్నారు. మంగళవారం గుర్రంకొండలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుష్టువ్యాధిని ముందుగా గుర్తించి చికిత్స అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు ఇంటింటా కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. తొలి దశలోనే కుష్టువ్యాధిని గుర్తిస్తే తొందరగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోటలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి స్థానిక హర్షిణ్ ల్యాబ్‌లో వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 50 మంది పాల్గొనగా 30 మందిని ఆపరేషన్ కోసం ఎంపికచేశామన్నారు. 12 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు భాస్కర్, హర్షవర్ధిణి తెలిపారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించరా?

బి.కొత్తకోట: మండల తహసీల్దార్ పోస్టుకు తహసీల్దార్లు కరువవయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రఫీక్ అహ్మద్ ఉద్యోగ విరమణ చేయడంతో ఎన్నికల విధుల కోసం అనంతపురం కలెక్టరేట్‌లో పని చేస్తున్న పుణ్యవతిని తహసీల్దార్‌గా నియమించారు. ఎన్నికల ఫలితాలొచ్చాక ఆమెను తిరిగి అనంతపురంకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన తహసీల్దార్ శ్రీధర్‌రావును నియమించగా ఆయన రెండునెలలు కూడా పనిచేయకనే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యసాయిజిల్లాకు చెందిన తహసీల్దార్ నరేంద్రకుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అయితే ఆయన విధుల్లో చేరకపోవడంతో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీని ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన నిన్నటి వరకు తహసీల్దార్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో కొత్తగా తహసీల్దార్‌ను నియమిస్తారని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం జరిగింది. అనుకున్నట్టు బదిలీలు జరిపిన అధికారులు బి.కొత్తకోటకు తహసీల్దార్‌ను నియమించలేదు. ప్రస్తుతం ఎఫ్ఏసీ డిప్యూటీ తహసీల్దార్‌ను తప్పించి రాయచోటి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మొహమ్మద్ అజారుద్దీన్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. దీనితో ఇక్కడ రెగ్యులర్ తహసీల్దార్ స్థానంలో ఒక డీటీని తప్పించి ఇంకో టీడీకి బాధ్యతలను అప్పగించారే తప్ప రెగ్యులర్ అధికారిని నియమించలేకపోయారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

– సైనిక సంక్షేమాధికారి రజాక్



మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమాధికారి రజాక్

మదనపల్లె : మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కడపజిల్లా సైనిక సంక్షేమాధికారి రజాక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సర్వసభ్య సమావేశం జరిగింది. డివిజన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మాజీ సైనికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సైనికబోర్డు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో జారీచేసిన మాజీ సైనికుల ఐడెండిటీ కార్డులను, అన్నమయ్య జిల్లా అడ్రస్సుతో మార్పు చేసి జారీ చేస్తున్నామన్నారు. మాజీ సైనికుల పెన్షన్‌కు సంబంధించిన స్పర్శ్‌కు సంబంధించిన సమస్యలు, నమోదుపై వివరించారు. మాజీ సైనికులు చనిపోతే, వారి దహనక్రియలకు క్యాంటీన్, జిల్లా సైనిక సంఘం ద్వారా అందించే మొత్తాలపై తెలిపారు. సమావేశంలో భాగంగా కొత్తగా రిటైర్ అయిన మాజీ సైనికులకు ఐడెంటిటీ కార్డులు జారీచేశారు. లైఫ్ సర్టిఫికేట్ జీవన్‌ప్రమాణ్ పత్రాన్ని ఇచ్చే విధానంపై తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ లెఫ్టినెంట్ కల్నల్ బాషా, వైస్ ప్రెసిడెంట్ సి.లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ వెంకటస్వామి, ప్రతాపరెడ్డి, సెక్రటరీ సుబ్బారాయుడు, ఈసీ మెంబర్లు భీమారెడ్డి, సురేష్‌బాబు, పీవీ.రెడ్డి, సత్యనారాయణ, రమణప్ప పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

మదనపల్లె : సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నక్కలదిన్నె స్వాస్థ్య ఆస్పత్రిలో మంగళవారం కిడ్నీ, రక్తపోటుసమస్యలకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. అమెరికాకు చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్.ప్రియా కాళహస్తి, వైద్యశిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించారు. అధిక రక్తపోటు, డయాబెటిస్, కిడ్నీ జబ్బులు కలిగిన పలువురు ఉచిత వైద్యశిబిరంలో పాల్గొని చికిత్స పొందారు. ఈ సందర్భంగా డాక్టర్.ప్రియా మాట్లాడుతూ...మంగళవారం నుంచి గురువారం వరకు మూడురోజులు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం .12.30 వరకు, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కిడ్నీ, డయాబెటిస్, బీపీ సమస్యలతో బాధపడుతున్న రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. అపాయింట్‌మెంట్ కోసం 9491464633, 9441464633 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఘనంగా కనుమ పండుగ



పీలేరు: బందారువాండ్లపల్లె వద్ద చిట్లాకుప్ప వద్ద పశువుల ప్రదక్షిణలు



ఎరప్రశెట్టిపల్లిలో పశువులను అలంకరించిన దృశ్యం

పీలేరు రూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని బందారువాండ్లపల్లె, మోడల్‌కాలనీ, దొడ్డిపల్లె పంచాయతీ కొండ్రెడ్డిగారిపల్లెలో కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రతి ఇంటిముందు మహిళలు శోభాయమానంగా ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ప్రతిష్టించి పూజలు చేశారు. ఉదయం ఇంటిముందు చల్లపెట్టి అనంతరం గ్రామస్తులంతా మూకుమ్మడిగా తీసుకెళ్లి గ్రామ సమీపంలో మంచినీటి చెరువుల్లో వేశారు. సాయంత్రం పశువులను రంగు రంగుల బెలూన్‌లు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పశువులకు పూజలు నిర్వహించి గ్రామాల సమీపంలోని కాటంరాజు వద్దకు తోలుకు వెళ్లారు. కాటంరాజు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం చిట్లాకుప్పలకు నిప్పంటించి భక్తులు, ప్రజలు వీక్షించారు. చిట్లా కుప్పల చుట్టూ పశువులను ప్రదక్షిణలు చేపించారు.

ఘనంగా పశువుల పండుగ

రామసముద్రం : రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ ఎర్రప్రశెట్టిపల్లిలో మంగళవారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, వైఎస్సార్ సీపీ అభిమాని నరసింహులు తన ఎద్దులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిల ఫొటోలతో ఎద్దులను అలంకరించారు. పండుగకు జెడ్పీటీసీ సిహెచ్. రామచంద్రారెడ్డి హాజరై నరసింహులును అభినందించారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

నిమ్మనపల్లె : మండలంలోని దివ్యాంగుల పింఛన్లను అధికారులు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీలోని 1, 2 సచివాలయాల పరిధిలో మంచానికే పరిమితమై రూ. 15 వేల పింఛన్ పొందుతున్న దివ్యాంగులను డాక్టర్ల బృందం తనిఖీ చేసింది. కడప ప్రభుత్వ ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి, రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎ.రామరాజు, మదనపల్లి మండలం వేంపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అష్రఫ్ షేక్ బృందం తనిఖీలు నిర్వహించారు. నిమ్మనపల్లి పంచాయతీలోని 19 పింఛన్లు పరిశీలించి పూర్తి వివరాలు సేకరించారు . మండలంలో 153 మంది రూ.15 వేలు పింఛను తీసుకుంటున్నారు. పంచాయితీ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

తంబళ్లపల్లె: మండలంలో మంగళవారం వైఎస్సార్‌కడప జిల్లాకు చెందిన అధికారుల తనిఖీ బృందం మంగళవారం మెడికల్ పింఛన్లను తనిఖీ చేశారు. డాక్టర్ రామమోహన్, సునిల్‌దత్, కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ మునికుమార్, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్‌లు కుక్కరాజుపల్లె, కోటకొండ, రేణిమాకులపల్లె, కన్నెమడుగు, ఎద్దులవారిపల్లె పంచాయతీలలో మెడికల్ పెన్షన్ పొందుతున్న 29 మంది లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులపై పరిశీలన చేశారు. వైకల్యాన్ని వైద్య బృందం పరీక్షించారు. తనిఖీ నివేదికలను ఉన్నతాధికారులను పంపుతామని వైద్యాధికారులు తెలిపారు. అధిరానేల వారి వెంటన వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.